క్లుప్తంగా

కనుల పండువగా పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి : శ్రీకోదండరామస్వామివారి దేవాలయంలో మంగళవారం సాయంత్రం కనులపండువగా పట్టాభిషేకం మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని మూలమూర్తులు, ఉత్సవర్లకు అభిషేకం జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి పట్టాభిషేకం చేశారు. డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు పాల్గొన్నారు.

హిందీ భాషపై అవగాహన



సర్టిఫికెట్ అందిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో బోధనేతర సిబ్బందికి హిందీ భాషపై అవగాహన కల్పించేందుకు మంగళవారం ఒకరోజు కార్యశాల నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ బోధనేతర సిబ్బందికి హిందీ టైపింగ్, డాక్యుమెంట్ ప్రిపరేషన్, స్పీకింగ్, కౌశలాలు అంశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇప్పించామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు.

సీకామ్‌కు ఉన్నత విద్యామండలి ప్రశంస

తిరుపతి సిటీ : నాక్ బీప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించిన సీకామ్ డిగ్రీ కళాశాలపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రశంసలు కురిపించింది. నాక్ అక్రిడేషన్ గుర్తింపు పొంది విద్యారంగంలో అరుదైన మైలురాయిని అధిరోహించిందని కొనియాడింది. ఈ మేరకు మంగళవారం కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపల్, అధ్యాపక బృందానికి అభినందనలు తెలుపుతూ ఏపీఎస్‌సీహెచ్ఈ క్యూఏసీ వైస్ చైర్మన్, డైరెక్టర్ ప్రొఫెసర్ రామమోహన్‌రావు ప్రత్యేక సందేశం పంపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాకాల : వేసవి నేపథ్యంలో ప్రజలు అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఎఫ్ఓ గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మట్లాడుతూ ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అగ్నిప్రమాదాలు, నివారణపై డెమో చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బాలాజీ, నాగార్జున, సురేంద్రబాబు పాల్గొన్నారు.

‘పత్తిపాటి’కి కందుకూరి పురస్కారం



డాక్టర్ పత్తిపాటి వివేక్

తిరుపతి సిటీ : ఎస్వీయూ సాంస్కృతిక కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్‌ను జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయన అవార్డును అందుకోనున్నారు.

రోగుల కోసం పందిళ్లు



రుయాలో వేసిన పందిరి

తిరుపతి తుడా : వేసవి నేపథ్యంలో రోగులు ఇబ్బంది పడకుండా రుయా ఆస్పత్రిలో గ్రీన్ నెట్ తో పందిళ్లు వేశారు. అత్యవసర విభాగం నుంచి అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వరకు, ఈ ప్రాంతాలను కలుపుతూ ఓపి విభాగం వరకు పందిళ్లు వేయించారు. దీనిపై రోగులు హర్షం వ్యక్తం చేశారు.

అద్వితీయం





అభినయ్ రాసిన పుస్తకం

రెండు చేతులతో సంపాదించేవారు చాలామందే ఉంటారు. అయితే రెండు చేతులతో రాసే ప్రావీణ్యులు కొందరే ఉంటారు. కుడి చేత్తో రాస్తే అక్షరాలు ఎంత పొందికగా ఉంటాయో.. ఎడమ చేతితో రాసినా అందే పొందికగా ఉండడం విశేషమే మరి. మేక్ మై బేబీ జీనియస్ పాఠశాలకు వెళితే రెండు చేతులతో రాసే విద్యార్థులు కనిపిస్తారు. నాలుగు భాషల్లో ద్విచేతి విద్యలో వీరు ఆరితేరారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సంస్కృత బాషల్లో శిక్షణ పొంది ఇప్పటివరకు 500 మందికి పైగా ఉతీర్ణత సాధించారు. ఇది భారతదేశంలోనే తొలి సవ్యసాచి పాఠశాలగా గుర్తింపు పొందింది. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి సైతం కేవలం 30 రోజుల్లోనే రెండు చేతులతో రాసే నైపుణ్యం సాధించారు. ఇప్పటికే రెండు పుస్తకాలను రాసి నిపుణులను సైతం అబ్బురపరిచారు. – తిరుపతి మంగళం



రెండు చేతులతో రాయడం నేర్చుకుంటున్న విద్యార్థినులు

జగమంతా.. ఈవీంత!



ఆధునిక సమాజంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ట్రెండ్ నడుస్తోంది. ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో ఈవీల వైపు అధికంగా మొగ్గుచూపుతున్నారు. అయితే అవసరాలకు అనుగుణంగా చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఇళ్లు.. షాపింగ్ కాంప్లెక్సుల్లో చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తుండడపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం తమ నిర్మాణాల వద్ద ఈవీలు చార్జ్ చేసుకునే వెసులుబాటు ఉందని బ్రోచర్లపై పేర్కొంటున్నారు. అన్ని వసతులతోపాటు వినూత్న అవకాశం సైతం కల్పిస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారు.

- ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గుతున్న ప్రజలు
- అవసరాలకు తగ్గట్టు లేని చార్జింగ్ స్టేషన్లు
- ప్రత్యేక పాయింట్ అంటూ సిద్ధమవుతున్న రియల్ బ్రోచర్లు
- నివాస.. వాణిజ్య సముదాయాల్లో చార్జింగ్ సౌకర్యం అంటూ ప్రకటనలు

తిరుపతి మంగళం : పెట్రోల్, డీజిల్ ధరలు రోజుకో విధంగా ఉంటున్న నేపథ్యంలో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఈవీలను ప్రోత్సహిస్తుండడంతో చార్జింగ్ స్టేషన్ల అవసరం పెరిగింది. ఒకవైపు పెట్రోల్ బంక్‌లు వద్ద ఈవీ స్టేషన్లు ఏర్పాటవుతుంటే, మరోవైపు కొత్తగా నిర్మిస్తున్న నివాస, వాణిజ్య సముదాయాలలోనూ వీటిని నెలకొల్పుతున్నారు. జిమ్, స్విమ్మింగ్‌పూల్ అంటూ ప్రకటించే వసతుల జాబితాలో ఈవీ చార్జింగ్ పాయింట్ అని ప్రత్యేకంగా ప్రకటిస్తుండడం విశేషం.. దీంతో ప్రస్తుతమున్న భవనాలలో ధరలు 1శాతం మేర పెరిగితే, ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన కట్టడాల్లో ధరలు 2 నుంచి 5శాతం వరకు వృద్ధి చెందుతాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. 2030నాటికి ఎలక్ట్రిక్ వాహనాల వాటా 40శాతం కంటే ఎక్కువకు చేరే అవకాశముంది. దీంతో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఉన్న భవనాలకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. కొత్త ప్రాజెక్టులోనే కాకుండా ఇప్పటికే ఉన్న భవనాలలో కూడా ఈవీ పాయింట్ల ఏర్పాటు భారీగా పెరగనుంది. ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో యజమానులు సర్వీస్ ప్రొవైడర్ల సహాయంతో ఈవీ స్టేషన్లను ఇన్‌స్టాల్ చేస్తున్నారు. పెద్ద స్థాయి ప్రాజెక్టులు, గేటెడ్ కమ్యూనిటీలలో అసోసియేషన్లు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. ఇందుకోసం వినియోగదారులపై నిర్ణీత రుసుములను వసూలు చేస్తున్నారు. రానున్న కొత్త సముదాయాలలో 5శాతం పార్కింగ్ స్థలాన్ని ఈవీ చార్జింగ్ స్టేషన్ల కోసమే కేటాయిస్తారని జేఎల్ఎల్ ఇండియా స్ట్రాటర్జిక్ కన్సల్టింగ్ అండ్ వాల్యుయేషన్ అడ్వైజరీ సంస్థ ఇప్పటికే తెలిపింది. ఈవీ స్టేషన్ల ఏర్పాటు కోసం ఇప్పటికే ఉన్న పెద్ద రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలలో చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు వ్యయం, పరిమిత విద్యుత్ సరఫరా సామర్థ్యాల మేరకు 1శాతం ప్రీమియం ఉంటుందని పేర్కొంది. 60శాతం కంటే ఎక్కువ నివాసితులు ఈవీ చార్జింగ్ పాయింట్ల అవసరాన్ని కోరుకుంటుంటే ఈ ప్రీమియం 2నుంచి 5శాతం వరకు ఉంటుందని స్పష్టం చేసింది.



నగరంలోని చార్జింగ్ స్టేషన్

కార్యాలయాల వద్ద సైతం

ఈవీ స్టేషన్లు ఉన్న ఆఫీస్ స్పేస్‌లకు కూడా డిమాండ్ ఏర్పడింది. కొందరు స్థల యజమానులు వినియోగదారు రుసుముతో ఈవీ స్టేషన్ల సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు చార్జింగ్ సర్వీస్ ప్రొవైడర్లకు భూమిని లీజుకు లేదా రెవెన్యూ షేర్ కింద అప్పగిస్తున్నారు. అయితే ఆఫీస్ పార్కింగ్‌లలో ఖాళీ స్థలాలే అసలైన సవాల్. ఇప్పటికే ఉన్న కొన్ని కార్యాలయాల పార్కింగ్ స్టేషన్లలో ఇలాంటి అవసరాల కోసం కొంత స్థలం కేటాయించుకున్నారు. ప్రభుత్వ విభాగాలు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి వాటిని ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇవ్వవచ్చు.లేదా దీర్ఘకాలానికి సంబంధిత భూమిని సర్వీస్ ప్రొవైడర్లకు లీజుకు ఇవ్వవచ్చునని జేఎల్ఎల్ సైతం సూచించింది.

నోటీస్ బోర్డు

- ఎస్వీయూ పరిధిలోని పీజీ కళాశాలల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సైన్స్ గ్రూప్ కోర్సుల 4వ సెమిస్టర్.
- మంగళం రోడ్డులోని విద్యానగర్‌లో ఉన్న శ్రీఅజేయ శంకర ట్రస్ట్ నూతన భవనంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు శ్రీనివాస కల్యాణ మహోత్సవం.
- అసెంబ్లీ పద్దుల కమిటీ పర్యటన. ఉదయం 11 గంటలకు పద్మావతి అతిథిగృహంలో అధికారులతో సమీక్ష. రాత్రి తిరుమలలో బస.
- టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ నివాసం వద్ద ఉదయం 10.30 గంటలకు ప్రజాదర్బార్.
- తుమ్మలగుంటలోని టీటీడీ గోశాలను ఉదయం 11 గంటలకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సందర్శించనున్నారు.

విద్యార్థి విభాగం నేతకు సత్కారం



ఓబుల్‌రెడ్డిని సన్మానిస్తున్న మోహిత్ రెడ్డికి

తిరుపతి సిటీ : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఓబుల్‌రెడ్డిని పార్టీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండలం రామాపురానికి చెందిన ఓబుల్‌రెడ్డి ఎస్వీయూలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. తన నియామకానికి తోడ్పడిన భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన లక్ష కుంకుమార్చన



కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమం మంగళవారంతో వైభవంగా ముగిసింది. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మమత పాల్గొన్నారు.

రామనామమే జీవిత పరమార్థం



దుప్పట్లు, చేతి కర్రలు పంపిణీ చేస్తున్న చంద్రమౌళి

తిరుపతి కల్చరల్ : యుగ యుగాలకు రామనామమే జీవిత పరమార్థమని మానసిక నిపుణుడు చంద్రమౌళి తెలిపారు.రాస్ పొదుపు సంఘాల మహిళలతో కొరమేనుగుంటలోని రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సనాతన ధర్మాన్ని ఆచరణలో పెట్టి మంచి పరిపాలన విధానాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన మార్గదర్శకులు శ్రీరాములవారని కొనియాడారు. రాస్ పథక సంచాలకుడు వి.నాగరాజు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా చైతన్యవంతం చేయడం, చేతివృత్తుల ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వడం, కుటుంబ పోషణకు ఆదాయ మార్గాలను చూపించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు, చేతికర్రలు, వాకర్లు అందజేశారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాస్ సిబ్బంది వాణి, కవిత, మంజుల, సత్యనారాయణ, నాగమణి, దేశమ్మ, మౌనిక, రాజేశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా ‘గంగ జాతర’ నిర్వహణ



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు సమష్టిగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదేశించారు. మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ జాతర విశిష్టతకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరా, వాహనాలు పార్కింగ్, క్యూల ఏర్పాటు, పొంగళ్లు పొంగించేకునేందుకు వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని కోరారు. గంగమ్మ గుడి ఈఓ జయకుమార్, ఎంఈ తులసి కుమార్ పాల్గొన్నారు.

వాడీ వేడిగా మండల మీట్



చిసమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం వాడీ వేడిగా సాగింది. ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉపాధి హామీ పనులు, గోకులం షెడ్ల నిర్మాణాలపై ప్రజా ప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధిలో అవినీతికి అధికారులే కారణమంటూ మండిపడ్డారు. సర్పంచులు మూకుమ్మడిగా గోకులం షెడ్ల నిర్మాణంలో అవకతవకలపై నిలదీశారు. ప్రభుత్వ భూముల్లో షెడ్లు నిర్మించడంతో పాటు, పార్టీ రంగులు వేయడం, అర్హత లేనివారికి షెడ్లు ఇవ్వడం, అర్హులైన పాడి రైతులకు మొండిచేయి చూపడంపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఎంపీడీఓ గిడ్డయ్య, జెడ్పీటీసీ సభ్యులు స్వరూప, డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవకుమార్, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులను అడ్డుకున్న సీఐ

మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న స్త్రీ శక్తి భవనంలోకి వెళుతున్న ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులను భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా అడ్డుకున్నారు. ఎంపీడీఓను పక్కనపెట్టుకుని ఆయన చెప్పిన తర్వాతే లోపలికి అనుమతించడం గమనార్హం.

ప్రభుత్వ విధానాలపై పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ పిలుపు నిచ్చారు. మంగళవారం బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ‘మే డేని జయప్రదం చేద్దాం, మే డే స్ఫూర్తితో 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం’ పేరిట కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు ఎన్‌డీ.రవి, గోవిందస్వామి, సీపీఐ నేత విశ్వనాథ్, ప్రజానాట్యమండలి నేత చిన్నం పెంచలయ్య, మహేంద్ర ,శ్రీనివాసులు, కార్తీక్ ,సురేష్, నాగరాజు, సెల్వ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పిల్లల అప్పగింత

తిరుపతి రూరల్: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఐదుగురు పిల్లలను పోలీసులు సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. తిరుపతి రూరల్ మండలం మంగళం ప్రాంతానికి చెందిన ఆమన్, ఆసిఫ్, వెంకటేష్, వాసు, మిథున్‌వర్ధన్ పాండిచ్చేరి చూడాలన్న ఆశ పడ్డారు. దీంతో తమ ఇళ్లలో రూ.3 వేలు తీసుకుని తల్లిదండ్రులకు తెలియకుండా ఇళ్ల నుంచి బయలుదేరి ఆదివారం 12 గంటలకు తిరుపతి నుంచి రైలు ఎక్కి పాండిచ్చేరికి వెళ్లారు. అక్కడ అర్ధరాత్రి సమయంలో రైలు దిగి, ఎక్కడ ఉండాలో తెలియక భయంతో రైల్వేస్టేషన్ దగ్గరలో ఉన్న లాడ్జికి వెళ్లారు. అక్కడ లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చి పాండిచ్చేరి పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసు వారు పిల్లల నుంచి పూర్తి సమాచారం సేకరించి, తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తమ సిబ్బందిని అప్రమత్తం చేసి, పాండిచ్చేరి పోలీసుల వద్ద ఉన్న పిల్లలతో వారి తల్లిదండ్రులను ఫోన్‌లో మాట్లాడించి, తరువాత వారిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. జిలా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పిల్లల ఆచూకీ తెలియగానే స్పందించి వారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించిన తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు జగన్నాథం, సాయినాథ్ చౌదరిని ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇటీవల నిర్వహించిన ఐఎస్‌టీఎస్ ఒలింపియాడ్ ఫైనల్‌లో శ్రీచైతన్య విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫైనల్‌లో 24మంది విద్యార్థులు రాణించి 5లాప్‌ట్యాప్‌లు, 19ట్యాబ్‌లను సొంతం చేసుకున్నారు. మంగళవారం ఈ మేరకు విద్యార్థులను డీఈఓ కేవీఎన్ కుమార్ అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీచైతన్య ఏజీఎం సురేష్ పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



నగరంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. 8 నుంచి 9 గంటల వరకు వీచిన పెను గాలులకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో నగరవాసుల తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. – తిరుపతి తుడా